సాక్షి సిద్దిపేట

గురువారం । 27 । మార్చి । 2025



దొడ్డు బియ్యం మాటేంటి?

రేషన్ దుకాణాల్లో పేరుకుపోయిన దొడ్డు బియ్యం నిల్వలపై డీలర్లు ఆందోళన చెందుతున్నారు. వివరాలు 8లో ▸



మొక్కల రక్షణకు..

ఎండలకు మొక్కలు ఎండిపోకుండా నర్సరీలలో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వివరాలు 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం	శుక్రవారం
సా. 6.35 గం.	ఉ. 4.51 గం.

న్యూస్‌రీల్

ఖాళీ బిందెలతో ధర్నా



రహదారిపై ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కోహెడరూరల్(హుస్నాబాద్): తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. మండలంలోని సముద్రాల గ్రామంలో కొన్ని రోజులుగా తాగు నీరు రావడం లేదంటూ పలువురు మహిళలు బుధవారం సిద్దిపేట–హుస్నాబాద్ రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. సుమారు గంటకుపైగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. చాలా రోజులుగా నీటి సమస్య ఉందని ఎంతకీ అధికారులు స్పందించకపోవడంతో చేసేదిలేక ఆందోళనకు దిగామని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు ఈ నెలాఖరులోగా తమ లైఫ్ సర్టిఫికెట్లను సంబంధిత సబ్ ట్రెజరీ కార్యాలయాలలో సమర్పించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించని వారికి ఏప్రిల్ నెల పెన్షన్ నిలిపి వేస్తారన్నారు. మీసేవ కేంద్రం ద్వారా లేక పోస్టల్ డిజిటల్ పేమెంట్ పద్ధతి ద్వారా.. లేదంటే ప్రత్యక్షంగా లైఫ్ సర్టిఫికెట్లు అందించే అవకాశం ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలోని గిరిజన యువతీయువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వ్యాధి నిరోధక టీకాలివ్వండి

రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యునైజేషన్ అధికారి సుధీర



సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న సుధీర

సిద్దిపేటకమాన్: చిన్నపిల్లలకు, గర్భిణులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం అమలు చేయాలని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుధీర అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలోని చిన్న పిల్లల విభాగం, ఎస్‌ఎన్‌సీయూ వార్డును, సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను, జిల్లాలోని పలు పీహెచ్‌సీలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వాన్‌కుమార్‌తో కలిసి ఆమె బుధవారం పరిశీలించారు. చిన్న పిల్లలకు అందుతున్న ఆరోగ్య, వైద్య సేవలపై ఆరా తీసి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల పట్ల తల్లిపాల ప్రాముఖ్యత గురించి బాలింతలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి, ఆర్‌ఎంఓలు పద్మజ, శ్రావణి, రాష్ట్ర బృందం, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

గజ్వేల్‌రూరల్: ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య సూచించారు. ఈ సందర్భంగా బుధవారం మిషన్ భగీరథ అధికారులను కలిసి నీటి సమస్యను వివరించారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని బాలుర, బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో పర్యటించి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

భగీరథ అందక.. గొంతు తడవక



'మిషన్ భగీరథ'కు పట్టినిల్లు అయిన గజ్వేల్‌లోనే మంచినీళ్ల కష్టాలు మొదలయ్యాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి గడపకు నల్లా ద్వారా మంచినీటిని అందించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టింది. కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో ప్రధాని మోదీ 2016 ఆగస్టు 7న ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కానీ నేడు ఈ ప్రాంతానికి సరిపడా నీటి సరఫరా జరగకపోవడంతో నీటి కష్టాలు తప్పడంలేదు.

- 'మిషన్ భగీరథ'కు అంకురార్పణ జరిగిన చోటే తగ్గిన నీటి సరఫరా
- రోజువారీ వినియోగం 70ఎంఎల్‌డీ పైనే..
- సరఫరా అవుతోంది... 60లోపే
- రాబోవు రోజుల్లో కొరత తీవ్రమయ్యే అవకాశం
- మల్లన్నసాగర్ పైపులైన్ పూర్తయితే సమస్యకు పరిష్కారం

సాక్షి ఫోకస్

గజ్వేల్: 'మిషన్ భగీరథ' పథకం దేశం దృష్టిని ఆకర్షించింది. గతంలో సిద్దిపేట ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో కేసీఆర్.. మానేరు ద్వారా సిద్దిపేటకు వాటర్‌గ్రిడ్ తరహాలో అందించిన నీటి పథకం తీరును పరిశీలించి రాష్ట్ర వ్యాప్తంగా 'మిషన్ భగీరథ'కు శ్రీకారం చుట్టారు. తొలి ఫలాలను గజ్వేల్ అందుకుంది. కేసీఆర్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కానుకగా 2015 జూన్ 2న గజ్వేల్ వాటర్ గ్రిడ్‌కు (గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాలు) రూ.1,055కోట్లు మంజూరు చేశారు. హైదరాబాద్‌కు గోదావరి జలాలను తరలించే పైప్ లైన్ నుంచి నీటిని ట్యాపింగ్ చేసి ఈ ప్రాంతానికి అందిస్తున్నారు. ఇందులో భాగంగానే కొండపాకలోని హెచ్‌ఎండబ్ల్యూఎస్ (హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్)ప్రాంగణం నుంచి, ప్రజ్ఞాపూర్ వద్ద పైప్‌లైన్ నుంచి నీటిని ట్యాపింగ్ చేస్తున్నారు. ప్రజ్ఞాపూర్ నుంచి పైప్‌లైన్‌ను ట్యాపింగ్ చేసి ఆ నీటిని ఎత్తయిన ప్రదేశంలో ఉన్న గజ్వేల్ మండలం కోమటిబండ అటవీ ప్రాంతంలోని సంప్‌హౌస్‌కు తరలించి అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా గజ్వేల్ నియోజకవర్గంలోని 244 హాబిటేషన్లలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని కలుపుకుని మరో 65 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు.

గజ్వేల్‌లో నీటి కష్టాలు



మంచినీటి కష్టాలకు నిదర్శనం: తూప్రాన్ మున్సిపాలిటీలో ట్యాంకర్ల నీటి సరఫరా

దుబ్బాకకు సైతం ఇక్కడి నుంచే..

దుబ్బాక నియోజకవర్గంలో దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, చేగుంట, దౌల్తాబాద్ మండలాల్లోని 213 గ్రామాలకూ ఇక్కడి నుంచే మంచినీటి సరఫరా జరుగుతోంది.

సరఫరా 60ఎంఎల్‌డీలోపే..

ప్రస్తుతం కోమటిబండలోని 'మిషన్ భగీరథ' హెడ్‌వర్క్స్‌నుంచి గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు రోజువారీగా 70ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటిని సరఫరా చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 60ఎంఎల్‌డీలోపే సరఫరా అవుతోంది. ట్యాపింగ్ పాయింట్ నుంచి ఇంతే నీరు వస్తుండటం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి నిత్యం 8ఎంఎల్‌డీ నీరు రావాల్సి ఉండగా.. 5ఎంఎల్‌డీ మాత్రమే వస్తున్నాయని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో నీరు సరిపోక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.



కమిషనర్‌కు వినతి..

ఈనెల 21న మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 15, 16 వార్డులకు చెందిన ప్రజలు కమిషనర్ గొల్కొండ నర్సయ్యకు మంచినీటి సమస్యపై వినతి పత్రం ఇచ్చిన సంగతి కూడా తెల్సిందే. నియోజకవర్గంలోని తూప్రాన్ మున్సిపాలిటీకి నిత్యం 6.3 ఎంఎల్‌డీ నీరు రావాల్సి ఉంది. అయితే 5.5ఎంఎల్‌డీ మాత్రమే వస్తుండటంతో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. కొండపాక మండలం లకుడారం గ్రామంలోనూ పైప్‌లైన్ సమస్య వల్ల నాలుగైదు రోజుల పాటు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. తర్వాత పునరుద్ధరించారు.



మల్లన్నసాగర్ లైన్ పూర్తయితేనే..

మల్లన్నసాగర్ జలాశయం నుంచి గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. మల్లన్నసాగర్ నుంచి వచ్చే జలాలు కొండపాక మండలం మంగోల్ డబ్ల్యూటీపీ (వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లో శుద్ధి జరిగి అక్కడి నుంచి సరఫరా అవుతాయి. ఇక్కడి నుంచి లకుడారం వద్ద నిర్మించిన జీఎల్‌బీ (గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)కి వస్తాయి. ఇక్కడి నుంచి ప్రస్తుతం సిద్దిపేట, జనగామ జిల్లాలకు ప్రత్యేక లైన్ ద్వారా ఇప్పటికే నీటి సరఫరా జరుగుతోంది. ఇక్కడి నుంచి రూ.210కోట్ల వ్యయంతో 16కిలోమీటర్ల పొడవున గజ్వేల్ మండలం అక్కారం సంపు వరకు లైన్ నిర్మాణం జరుగుతోంది. మరో నెల రోజుల్లో ఈ పనులు పూర్తయితే హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ నుంచి నీటిని తీసుకోవాల్సిన పరిస్థితి తప్పనుంది. అక్కారం సంపు నుంచి కోమటిబండ మిషన్ హెడ్‌వర్క్స్‌కు గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు సరిపడనంతగా నీరు రానుంది.



కోమటిబండలో ప్రధాని చేతులమీదుగా ప్రారంభించిన 'మిషన్ భగీరథ' హెడ్‌వర్క్స్ ఇదే

త్వరలోనే పైపులైన్ పూర్తిచేస్తాం

మల్లన్నసాగర్ నుంచి వచ్చే పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు ఇక ఇబ్బంది ఉండదు. త్వరలోనే ఈ పనులు పూర్తిచేసి హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ ట్యాపింగ్ మూసేస్తాం. ప్రస్తుతానికి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రయత్నిస్తున్నాం.

–శ్రీనివాస్, ఈఈ, గజ్వేల్ మిషన్ భగీరథ

స్వశక్తితో ముందుకు సాగాలి

అదనపు కలెక్టర్ అగర్వాల్



కేక్ కట్ చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటజోన్: మహిళలు స్వశక్తితో సాధికారత వైపు అడుగులు వేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. బుధవారం సెట్విన్ కేంద్రంలో మహిళలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు శిక్షణ ద్వారా మరింత నైపుణ్యం సాధించాలని సూచించారు. మహిళలకు రుణాలు, శిక్షణ తరగతులు, స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సెట్విన్ ఇన్‌చార్జి అమినా భాను, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం అందించండి

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట బాలికల గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలోని వంట గదిని, కూరగాయలు, బియ్యాన్ని పరిశీలించారు. బియ్యం నాణ్యతగా లేక పోవడంతో వెంటనే సివిల్ సప్లై అధికారులతో మాట్లాడారు. నాణ్యమైన బియ్యాన్ని అందించాలని ఆదేశించారు. వంట విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శారద, జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజ, తహసీల్దార్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గజ్వేల్: గజ్వేల్ ఆత్మ (అగ్రికల్చర్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) చైర్మన్‌గా నియమితులైన మద్దూరి మల్లారెడ్డి బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు డైరెక్టర్లుగా నియమితులైన మరో 24 మంది సైతం బాధ్యతలు చేపట్టారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, ఏడీఏ బాబునాయక్, వ్యవసాయాధికారి నాగరాజు మల్లారెడ్డితోపాటు డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లారెడ్డి

సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు

జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక తెలిపారు. బుధవారం మండలంలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు, పీఎస్‌బీ, ట్రైకోడెర్మా విరిడిని పంపిణీ చేశామన్నారు. పంట మార్పిడి వల్ల చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. ఎకరం వరిని పండించే నీటితో ఐదెకరాల మొక్కజొన్నను సాగు చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పంట మార్పిడి తప్పనిసరి

మర్కూక్(గజ్వేల్): పంట మార్పిడితోనే చీడపీడల ఉధృతి తగ్గుతుందని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక తెలిపారు. మండంలోని నర్సన్నపేటలో బుధవారం మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు యాసంగిలో పత్తి పంట తీసిన తర్వాత మొక్కజొన్న పంటలను సాగుచేయడం వలన నీటిని ఆదాచేయడంతోపాటు పంటమార్పిడి జరుగుతుందని తెలిపారు. తద్వారా చీడపీడల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఏఈఓ విష్ణు, రైతులు పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

విద్యతోనే అట్టడుగు వర్గాల అభివృద్ధి

- ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తం
- జాతీయ సదస్సు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న పురుషోత్తం తదితరులు

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యతోనే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సును బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచేలా ఉన్నత విద్యలో సమూల మార్పులు రాబోతున్నాయన్నారు. వీటిని వెనకబడిన వర్గాలు అందిపుచ్చుకుంటేనే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందన్నారు. కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి మాట్లాడుతూ ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ నేపథ్యంలో సామాజిక అంతరాలు మరింతగా పెరుగుతున్నాయని, వాటిని అధిగమించి అట్టడుగు వర్గాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. ప్రముఖ గాయకుడు దరువు ఎల్లన్న ఉద్యమ జ్ఞాపకాలు, పాటలతో విద్యార్థినీ, విద్యార్థులను అలరించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ శ్రద్ధానందం మాట్లాడుతూ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి 60 పరిశోధనా పత్రాలు వచ్చాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ కళాశాలలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించిన అర్థశాస్త్ర విభాగం అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో దరువు ఎల్లన్న, డా. దివ్య తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ అనురాధతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇదేం తీరు!

- సర్టిఫికెట్ల జారీకి కొర్రీ
- మీసేవలో కులం, ఆదాయానికి దరఖాస్తు చేసినా..
- తహసీల్దార్ కార్యాలయాల్లో హార్డ్ కాపీలు ఇవ్వాల్సిందే
- ఇందుకు ప్రత్యేక కౌంటర్లు సైతం ఏర్పాటు
- అధికారుల తీరుతో దరఖాస్తుదారులకు తప్పనితిప్పలు

సాక్షి, సిద్దిపేట: మీ సేవలో దరఖాస్తు చేసినా తహసీల్దార్ కార్యాలయంలో హార్డ్ కాపీలను అందజేస్తేనే కులం, ఆదాయం సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. ప్రజలు వివిధ సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకుండా ఉండేందుకే ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కానీ తహసీల్దార్ల కార్యాలయాల్లో పని చేసే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మళ్లీ పాత పద్ధతికే వచ్చింది. దీంతో ప్రధానంగా కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం కింద రుణాలు మంజూరు కోసం దరఖాస్తు చేసేందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు అవసరం. దీంతో వీటి కోసం బారులు తీరుతున్నారు.

మీ సేవలో చేస్తే సరిపోతుంది..

సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసిన ప్రజలు పడిగాపులు కాయవద్దన్న ఉద్దేశంతో 15 ఏళ్ల క్రితం మీ సేవ కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఆయా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లలో దరఖాస్తు చేసుకుంటే అధికారుల ఆమోదంతో ఎక్కడ దరఖాస్తు చేస్తే అక్కడే సర్టిఫికెట్లను తీసుకునే అవకాశం కల్పించారు. సర్టిఫికెట్ మేరకు మీ సేవ కేంద్రాల్లో రుసుం చెల్లించి రశీదు పొందాలి. ఆయా దరఖాస్తు సంబంధింత తహసీల్దార్ లాగిన్‌లోకి వస్తాయి. సంబంధిత కంప్యూటర్ ఆపరేటర్ వాటిని ప్రింట్ తీసి ఆర్ఐ, నాయబ్ తహసీల్దార్, తహసీల్దార్లకు అందజేయాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదం తెలపడంతో దరఖాస్తు దారునికి సర్టిఫికెట్ వస్తుంది. ఇలా కాకుండా తహసీల్దార్ కార్యాలయంలో సైతం మీ సేవలో చేసిన దరఖాస్తు హార్డ్ కాపీలను అందజేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి హార్డ్ కాపీలను స్వీకరించకుండానే దరఖాస్తులను పరిశీలించి ఆమోదం తెలపాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు.



సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం హార్డ్ కాపీలను స్వీకరిస్తున్న సిబ్బంది

కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు

తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తు హార్డ్ కాపీలను (దరఖాస్తు ఫారం, రేషన్ కార్డు, ఆధార్ కార్డుల జీరాక్స్‌లను, అప్లికేషన్ ఐడీ నంబర్) స్వీకరిస్తున్నారు. ఇలా కార్యాలయానికి తీసుకవచ్చిన వారివే అప్రూవల్ చేస్తున్నారు. హార్డ్ కాపీలను అందజేయని వారివి పెండింగ్‌లో పెడుతున్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకువచ్చినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు దారులకు కష్టాలు తప్పడం లేదు. పలువురు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సర్టిఫికెట్ల కోసం డబ్బులు సైతం వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

హార్డ్ కాపీలు ఇచ్చేందుకు వచ్చా..



ఆదాయం సర్టిఫికెట్ కోసం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేశా. అక్కడ చేసిన తర్వాత తహసీల్దార్ కార్యాలయంలోనూ హార్డ్ కాపీలను ఇవ్వాలంటే వచ్చాను. ఇస్తేనే సర్టిఫికెట్ వస్తుందట.

–హరీశ్, ఇర్కోడ్

నా దృష్టికి రాలేదు

కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం మీసేవలో దరఖాస్తు చేసిన తర్వాత హార్డ్ కాపీలను స్వీకరిస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. మీ సేవలో దరఖాస్తు చేసిన తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో హార్డ్ కాపీలను ఇవ్వాల్సిన పని లేదు. నిర్ణీత సమయంలో దరఖాస్తులు పరిశీలించి తహసీల్దార్లు ఆమోదం తెలుపుతారు.

–అబ్దుల్ హమీద్, అదనపు కలెక్టర్

మండుటెండలో వరుస కట్టి.. బడిబాట పట్టి



మండుటెండలో బడికి వెళ్తున్న విద్యార్థులు

మండుతున్న ఎండల నేపథ్యంలో ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటేనే జనం జంకుతున్నారు. విద్యార్థులు తప్పని పరిస్థితుల్లో మిట్ట మధ్యాహ్నం వేళ ఎండలోనే బడికి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మిరుదొడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం టెస్ట్ పరీక్షలు జరుగుతుండటంతో మిగతా తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం వేళ పాఠాలను బోధిస్తున్నారు. ఈ క్రమంలో ఎస్సీ, బీసీ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు మండుటెండలో వరుసకట్టి బడికి వెళ్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– మిరుదొడ్డి(దుబ్బాక)

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు పూలే విద్యార్థినులు


శ్రీజ


నవ్య

వర్గల్(గజ్వేల్): వికసిత్ భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్ రాష్ట్రస్థాయి పోటీలకు వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల సిద్దిపేటలో 'ఒక దేశం–ఒక ఎన్నిక' అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గురుకుల కళాశాలకు చెందిన ఫైనలియర్ విద్యార్థినులు పుప్పాల శ్రీజ, గంగుల నవ్య చక్కని ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. వీరికి హైదరాబాద్ అసెంబ్లీ సమావేశంలో పాల్గొని మాట్లాడే అరుదైన అవకాశం లభించనుందని తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తోపాటు ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ రాధారాణి, భాగ్యలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

మహిళలతో అసభ్యకర ప్రవర్తన

– ఇద్దరు రిమాండ్


నిందితులను చూపుతున్న సీఐ నాగరాజు

మెదక్ మున్సిపాలిటీ: మద్యం మత్తులో మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరిని పట్టణ పోలీసులు అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ నాగరాజు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన ఇద్దరు మహిళలు మంగళవారం రాత్రి పాత బస్టాండ్ వద్ద నుంచి స్కూటీపై వెళ్తున్నారు. మద్యం మత్తులో బైక్‌పై వెళ్తున్న మెదక్ పట్టణానికి చెందిన ప్రదీప్‌కుమార్, గిరికల మహేశ్ కుమార్ మహిళల పక్క నుంచి వెళ్తూ అసభ్యకరంగా ప్రవర్తించారు. పక్కన ఉన్న వారు వారించే ప్రయత్నం చేసినా వినలేదు. బాధిత మహిళలు నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరిపై పోక్సో కేసు

కొమురవెల్లి(సిద్దిపేట): రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం చేర్యాల సీఐ శ్రీను కథనం మేరకు.. మండలంలోని వేచరేణి గ్రామానికి చెందిన దినేష్, చేర్యాల పట్టణానికి చెందిన రాములు ఇద్దరు మైనర్ల పట్ల దురుసుగా ప్రవర్తించారు. బాధితుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

యువకుడు గల్లంతు

మనోహరాబాద్(తూప్రాన్): చెరువులో యువకుడు గల్లంతమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని రంగాయపల్లి గ్రామానికి చెందిన మన్నె అజయ్‌కుమార్ (26) చేపలు పట్టడానికి గ్రామ చెరువులోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. గ్రామస్తులతో గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం మరోసారి గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సన్నం సరే.. దొడ్డు బియ్యం మాటేంది?

- రేషన్ షాపుల్లో పేరుకుపోయిన దొడ్డు బియ్యం నిల్వలు
- రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మెట్రిక్ టన్నుల స్టాక్
- సన్న బియ్యం దింపేందుకు చోటులేదంటున్న డీలర్లు
- ఉగాది నుంచి పంపిణీకి సన్నాహాలు

సాక్షి, సిద్దిపేట: రేషన్ కార్డుదారులకు ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాల్లో పేరుకుపోయిన దొడ్డు బియ్యం నిల్వలపై డీలర్లు ఆందోళన చెందుతున్నారు. చిన్న చిన్న గదుల్లో రేషన్ షాపులను నడిపే డీలర్లు కొత్తగా వచ్చే సన్న బియ్యం స్టాక్‌ను ఎక్కడ దింపుకోవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం రేషన్ షాపుల్లో స్టాక్ ఉంది. దీనిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.


సిద్దిపేట పట్టణంలో ఓ రేషన్ షాపులో దొడ్డు బియ్యం

పేరుకుపోయిన దొడ్డు బియ్యం

ప్రతీ నెలా రేషన్ షాప్‌లలో నిల్వ స్టాక్‌ను మేరకు కొత్తగా బియ్యంను అలాట్‌మెంట్ చేసేవారు. ఏప్రిల్ నెల నుంచి సన్న బియ్యం ఇవ్వనుండటంతో పాత స్టాక్‌కు సంబంధం లేకుండానే ఎంఎల్ఎస్ పాయింట్‌ల నుంచి సరఫరా చేయనున్నారు. పోర్టబులిటీ సౌకర్యంతో డీలర్లు కోటాకు మించి బియ్యం తీసుకునే అవకాశంతో ఇప్పుడు వారికి ఇబ్బందులు తెచ్చిపెట్టింది. మార్చి నెలలో 1.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంకు గాను ఫిబ్రవరి నెలలో రేషన్ షాప్‌లలో స్టాక్ 29వేల మెట్రిక్ టన్నులుండగా కొత్తగా 1,51లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంను అలాట్ చేశారు. మార్చి నెలలో కార్డుదారులకు ఇవ్వగా రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల్లో 28,380.97 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం పేరుకుపోయాయి. అధికారులు ముందస్తు జాగ్రత్తగా లిమిట్ ప్రకారం రేషన్ షాపులకు బియ్యం కేటాయిస్తే ఇప్పుడు ఈ ఇబ్బంది వచ్చేది కాదు. సివిల్ సప్లయ్ అధికారుల ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో రేషన్ షాపుల్లో బియ్యం పేరుకపోయాయి. నిల్వ ఉన్న బియ్యంను వెనక్కి తీసుకోకుండానే సన్న బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటుండటంతో డీలర్లను కలవరపెడుతోంది.

ముందే తరలించాలి

అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోతే కార్డు దారులకు ఏప్రిల్ నెలలో సన్న బియ్యంకు బదులు దొడ్డు బియ్యంను అందించే అవకాశాలు ఉంటాయి. రేషన్ షాపుల్లో సన్న బియ్యం దింపక ముందే నిల్వ ఉన్న దొడ్డు బియ్యంను ఎంఎల్ఎస్ పాయింట్‌లకు తరలిస్తే ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా చేయొచ్చు అని లబ్ధిదారులు అభిప్రాయ పడుతున్నారు.

ఉమ్మడి జిల్లా	దొడ్డు బియ్యం నిల్వలు (మెట్రిక్ టన్నులు)
వరంగల్	4,000.51
మెదక్	2,156.7
ఆదిలాబాద్	1,677.05
ఖమ్మం	2,121.13
హైదరాబాద్	1,901.44
కరీంనగర్	2,205.33
మహబూబ్‌నగర్	4,605.31
నిజామాబాద్	1,412.57
రంగారెడ్డి	4,238.86
నల్గొండ	4,062.07

రాష్ట్రంలో రేషన్ కార్డుల వివరాలు

అంత్యోదయ	5,66,736
ఆహార భద్రత	85,47,142
అన్నపూర్ణ	5,390

రాష్ట్ర వ్యాప్తంగా 91,19,268 రేషన్ కార్డులున్నాయి. ఆహార భద్రత కార్డు(ఎఫ్ఎస్‌సీ) ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు(ఏఎఫ్ఎస్‌సీ)కు 35 కిలోలు, అన్నపూర్ణ అన్నయోజన (ఏఏవై) కార్డుకు 10 కిలోల చొప్పున పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. వీటికి ప్రతీ నెల దాదాపుగా 1.80లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

> **ఇంకా నిర్ణయం తీసుకోలేదు**
>
> 
>
> రేషన్ దుకాణాల్లో ప్రస్తుతం నిల్వ ఉన్న దొడ్డు బియ్యంను పక్కన పెట్టాలని ఆదేశించాం. దొడ్డు బియ్యం గురించి ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కార్డుల ప్రకారం సన్న బియ్యం కోటాను విడుదల చేస్తాం. కార్డు దారులకు ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుంది. ఇప్పటికే డీలర్లతో సమావేశాలు నిర్వహిస్తూంచాం. సన్న బియ్యంకు బదులు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే వారిపై క్రిమినల్ కేసులు పెడతాం.
>
> – తనూజ, డీఎస్‌ఓ, సిద్దిపేట

సంకల్ప దీక్షకు స్వాగతం


తలంబ్రాలను తయారు చేస్తున్న భక్తులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో గోటి తలంబ్రాలు అందించే సంకల్ప దీక్షకు బుధవారం స్వాగతం పలికారు. భద్రాచలం సీతారాముల కల్యాణానికి రాష్ట్రం నుంచి 250 కిలోల గోటి తలంబ్రాలు అందించేందుకు గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రామనామాన్ని స్మరిస్తూ గోటితో వడ్లను వలుస్తూ ధార్మిక సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


కుమార్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన కుమార్(28) పంచాయతీ కార్యాలయంలో తాత్కాలిక కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తనకు వచ్చే కొద్ది పాటి వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వేతనం సరిపోక సమయానికి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో మనస్తాపం చెంది 21న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే జోగిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైద్రాబాద్ ఉస్మానియాకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తమ్ముడు పోచయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాంచంద్రాపూర్‌లో మరో యువకుడు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సుంకరి నాగయ్య గొర్రెల కాపరిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు సుంకరి ప్రశాంత్(19) కొద్దిరోజులుగా ఏం పని చేయకుండా ఖాళీగా ఇంట్లో ఉంటున్నాడు. దీంతో తండ్రి మందలించాడు. మనస్తాపానికి గురైన ప్రశాంత్ వారం రోజుల కిందట క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

దు:ఖం దిగమింగి.. పరీక్ష రాసి


పరీక్ష రాసిన కావ్యశ్రీ

నిజాంపేట(మెదక్): తండ్రి మరణించిన బాధను దిగమింగుకొని విద్యార్థిని పరీక్షకు హాజరైంది. ఈ ఘటన మండలంలోని నస్కల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సత్యం (48) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కూతుర్లు ఉండగా.. రెండో కూతురు కావ్యశ్రీ కామారెడ్డి జిల్లా జంగంపల్లిలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. తండ్రి గుండెపోటుతో మృతి చెందాడని ఉదయమే సమాచారం రావడంతో తోటి విద్యార్థులు ఓదార్చారు. పరీక్ష రాసేలా ధైర్యం చెప్పారు. కావ్యశ్రీ గణిత శాస్త్రం పరీక్ష రాసి నస్కల్ గ్రామంలోని తండ్రి అంత్యక్రియలకు హాజరైంది.

న్యూమోనియాతో బాధపడుతూ నాలుగేళ్ల చిన్నారి


మాన్విత

సిద్దిపేటజోన్: న్యూమోనియాతో బాధపడుతున్న నాలుగేళ్ల పాప ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. సిద్దిపేట పట్టణానికి చెందిన శ్రీకాంత్ చారి, స్వాతిల ఏకైక కుమార్తె మాన్విత(4) 12 రోజుల కిందట అస్వస్థతకు గురికాగా స్థానిక సందీప్ చిల్డ్రన్ ఆస్పత్రిలో చేర్పించారు. నాటి నుంచి న్యూమోనియాతో బాధపడుతూ చికిత్స పొందుతుంది. బుధవారం అకస్మాతుగా పాప పరిస్థితి విషమించి మృతి చెందింది. ఇంజక్షన్ ఇచ్చిన కొద్ది నిమిషాల్లోనే పాప పరిస్థితి విషయంగా మారి చనిపోయిందని, వైద్యుల నిర్లక్ష్యం కారణంతోనే పాప చనిపోయిందని బంధువులు ఆరోపించారు. పాపను కాపాడేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, ఇందులో మా నిర్లక్ష్యం ఏమిలేదని ఆసుపత్రి నిర్వహకులు పేర్కొన్నారు. ముందు జాగ్రత్తగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిండా ముంచిన నకిలీ మందులు

- ఎర్రబడుతుందని పిచికారీ చేస్తే ఎండిపోయింది
- ఆరు ఎకరాల పంట నష్టపోయాయని ఓ రైతు ఆవేదన


వరిని, మందులను చూపుతున్న రైతు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పంట ఎర్రబడుతుందని, దోమకాటు రక్షణకు మందులను పిచికారీ చేస్తే ఉన్న వరి పంట ఎండుముఖం పట్టింది.. ఎకరం కాదు రెండు ఎకరాలు కాదు ఏకంగా ఆరు ఎకరాల పంటను నకిలీ మందులు నట్టేట ముంచాయని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామానికి చేబర్తి బాల పోచయ్య తనకున్న రెండు ఎకరాలతోపాటు 8 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని యాసంగిలో వరి సాగు చేశారు. కెనాల్ కాల్వ, బోర్ల ద్వారా పంటకు సాగునీరు పెడుతూ పంటను కాపాడుకుంటున్నాడు. కాగా వరి పంట ఎర్రబడుతుందని, పొట్ట సమయంలో దోమ కాటు నివారణ కోసం గజ్వేల్‌లోని శ్రీనిధి ట్రేడర్స్‌లో రూ.4,050 చెల్లించి ట్రెండ్, అచిబు వరి మందులను తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆరు ఎకరాల వరి పంటకు పిచికారీ చేశారు. బుధవారం ఉదయం వరి పంటను చూసేసరికి ఎండుముఖం పట్టింది. దీంతో సదరు రైతు చేతికొచ్చే సమయంలో వరి ఎండిపోవడంతో ఆందోళనకు గురి అయ్యారు. వెంటనే మందులు కొనుగోలు చేసిన డీలర్‌కు సమాచారం అందించారు. పంటను చూసి సదరు మందుల కంపెనీ దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టినట్లు రైతు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ముచ్చటగా మూడోసారి వాయిదా

- ముందుకు కదలని అంగడి బహిరంగ వేలం
- మహిళా సంఘాలను ఆహ్వానించే అవకాశం!


వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వారాంతపు అంగడి బహిరంగ వేలం ముచ్చటగా మూడోసారి వాయిదా వేశారు. గతేడాది రూ.కోటి 20 లక్షల 26 వేలు పలికింది. దీనికి 5 శాతం అదనంగా కలిపి రూ.కోటి 26 లక్షల 27 వేల 300 నుంచి సర్కార్ పాటను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 13 మంది గుత్తేదారులు రూ.10 లక్షల చొప్పున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. వేలం పాటను తగ్గిస్తేనే పాల్గొంటామని గుత్తేదారులు పాడకుండానే వెళ్తున్నారు. కరోనా సమయంలోనూ ఇలా జరగడంతో అంగడి నిర్వహణ బాధ్యతను కొన్ని నెలలపాటు మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందితో అంగడిలో రుసుం వసూలు చేశారు. ఇదే మాదిరి మరోసారి వేలం వాయిదా పడితే అంగడి నిర్వహణ బాధ్యతను తామే తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. అవసరమైతే అంగడి నిర్వాహణ కోసం మహిళా సంఘాలను ఆహ్వానించాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 28న మరోసారి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పనులు నాసి.. రూ.లక్షలు దోచి

- పంతుల్‌తండా గ్రామంలో సీసీ రోడ్లకు పగుళ్లు
- నిర్మాణం చేపట్టిన వారం రోజులకే


సీసీ రోడ్డుకు పగుళ్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): నాలుగు కాలాల పాటు నిలవాల్సిన సీసీ రోడ్లు వారానికే పగుళ్లు రావడంతో తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పలువురు తండావాసులు విలేకరులతో మాట్లాడారు. అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామంలో దాదాపు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డులో నాణ్యత లోపించిందన్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యి వారం కాక ముందే పగుళ్లు రావడం దారుణమన్నారు. సీసీ రోడ్ల నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ ఉండకపోవడంతోనే ఇలా జరిగిందన్నారు. ఇకనైనా సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని పగుళ్లు వచ్చిచోట మరమ్మతు పనులు చేయించాలని కోరారు.

క్రికెట్ బెట్టింగ్స్‌పై ప్రత్యేక నిఘా


మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: క్రికెట్ బెట్టింగ్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. పెండింగ్ కేసులపై పోలీసు కమిషనరేట్‌లో అధికారులతో సీపీ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో 60 రోజుల్లో ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జీషీట్ వేయాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు. నిందితుల అరెస్టు విషయంలో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్, కిరణ్, రామకృష్ణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నకిలీ ఔషధాలు తయారు చేయడం లేదు

- సీఎంఓ ద్వారా చట్టబద్ధంగా ధ్రువీకరించారు
- జోడాస్ పరిశ్రమ హెచ్‌ఆర్ శ్రీకాంత్


ధ్రువీకరణ పత్రాలను చూపుతున్న పరిశ్రమ ప్రతినిధులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని కర్కపట్లలో ఉన్న జోడాస్ ఎక్స్ పోయిమ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో నకిలీ ఔషధాలు తయారు చేయడం లేదని జోడాస్ పరిశ్రమ హెచ్‌ఆర్ శ్రీకాంత్, నూకరాజు తెలిపారు. బుధవారం పరిశ్రమలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఔషధాల ప్యాకింగ్ కవర్లపై రష్యా భాషలో ముద్రించడంతో కొంతమంది బాహ్య వాటాదారులు నకిలీ మందులు పంపిణీ చేస్తున్నారని నకిలీ ఔషధ పంపిణీ కేసుగా చిత్రీకరించారన్నారు. ఈ సమస్య రష్యాలో విస్తరించడంతో ఔషధ పంపిణీ విషయంలో తమ పరిశ్రమకు చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పరిశ్రమ యజమానులు తమ నివేదికలను డీసీఏ తెలంగాణకు సమర్పించారని వెంటనే వాటిని డ్రగ్ కంట్రోల్ అధికారులు పరిశీలించి కాంట్రాక్ట్ మాన్యు ఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్(సీఎంఓ) ద్వారా చట్టబద్ధంగా తయారు చేయబడ్డాయని స్పష్టం చేశారన్నారు. అందుకు గాను ధ్రువీకరణ పత్రాలను అధికారులు బుధవారం అందించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించిన ఔషధాలను మాత్రమే తయారు చేసి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

బేస్ బాల్‌లో క్రీడాకారిణి ప్రతిభ

మిరుదొడ్డి(దుబ్బాక): నాల్గో అంతర్జాతీయ విమెన్ బేస్ బాల్ ఆసియా కప్ క్వాలిఫయర్‌కు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లికి చెందిన పోసాన్‌పల్లి కవిత ప్రతాప్ దంపతుల కూతురు సౌమ్య ఎంపికైంది. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో వచ్చే నెల 23 నుంచి 29 వరకు జరిగే క్వాలిఫయర్ పోటీల్లో పాల్గొననుంది. సౌమ్య ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా సౌమ్యను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. థాయ్‌లాండ్ వెళ్లడానికి ఆర్థిక స్తోమత లేని ఆమెకు విమాన ఛార్జీలతో పాటు, తదితర ఖర్చులకు ఆర్థిక సాయం అందజేస్తానని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచం యాదగిరి, ప్రతాప్‌రెడ్డి, సిద్ధా రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హనుమంతోత్సవ వైభవం

- నాచగిరిలో ఆధ్యాత్మిక పరిమళం
- సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించిన శ్రీమాధవానంద సరస్వతీ


హనుమత్ వాహనంపై నాచగిరీశుడు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హనుమంతోత్సవ సేవ వైభవంగా జరిగింది. విశేషాలంకృతమైన హనుమత్ వాహనంపై శ్రీలక్ష్మీనారసింహులు అధిష్ఠించారు. భక్తజన హర్షధ్వానాల మధ్య ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ ఈఓ పార్నంది విశ్వనాథశర్మ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. అలాగే, నాచగిరి క్షేత్రంలో ధార్మిక, సంగీత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు తెరలేచింది. బుధవారం సాయంత్రం పీఠాధిపతి శ్రీమాధవానంద స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ధార్మిక కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఈఓ విశ్వనాథశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారు భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. వర్గల్ వేదపాఠశాల విద్యార్థుల సామూహిక వేదపఠనంతో సాంస్కృతిక కార్యక్రమాల సందడి మొదలైంది.


సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభిస్తున్న శ్రీమాధవానంద సరస్వతీ